మలక్‌పేటలో చతుర్ముఖ పోటీ!

- ఖరారైన ప్రధాన పార్టీల అభ్యర్థులు
- బుజ్జగింపుల పర్వం ముగించి రంగంలోకి....
- రసకందాయంగా ఎన్నికల సమరం


అహ్మద్ బలాల - ఎంఐఎం అభ్యర్థి


సంరెడ్డి సురేందర్‌రెడ్డి - బీజేపీ అభ్యర్థి


షేక్ అక్బర్ - కాంగ్రెస్ అభ్యర్థి


అజిత్‌రెడ్డి - బీఆర్‌ఎస్ అభ్యర్థి

జంగ్ 2023 తెలంగాణ

దిల్‌సుఖ్‌నగర్/సైదాబాద్: ప్రధాన పార్టీల నుంచి అభ్యర్థులు ఖరారు కావటంతో మలక్‌పేట నియోజకవర్గంలో చతుర్ముఖ పోటీకి తెరలేచింది. నియోజకవర్గంలో పోటీకి పలు పార్టీల నుంచి ఆశావహులు ప్రయత్నాలు చేసినా శుక్రవారం నాటికి నాలుగు ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించడంతో నాయకుల నరాలు తెగే ఉత్కంఠకు తెరపడింది. బరిలో నిలిచే వారు ఎవరో తేలిపోవడంతో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు సంబురాలు ముగించి అసలు పోటీకి సిద్ధమవుతున్నారు. టికెట్ దక్కించుకున్న అభ్యర్థులు తమ పార్టీల నుంచి అవకాశం కోసం ప్రయత్నించిన ఆశావహులను బుజ్జగించే పనిలో పడ్డారు. నామినేషన్లు దాఖలు చేసే లోపు వారిని శాంతింపచేసి తమకు మద్దతు తెలిపేలా వారి ఇళ్ల వద్దకు వెళ్లి కలుస్తున్నారు. మలక్‌పేట సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన అహ్మద్ బలాల ఎంఐఎం నుంచి, అధికార బీఆర్‌ఎస్ అభ్యర్థిగా అజిత్‌రెడ్డి, ప్రతిపక్ష కాంగ్రెస్ నుంచి షేక్ అక్బర్, బీజేపీ నుంచి సంరెడ్డి సురేందర్‌రెడ్డి ఈసారి ఎన్నికల్లో పోటీ పడుతుండటంతో నియోజకవర్గంలో పోటీ రసకందాయంగా మారబోతుంది.

పాతబస్తీ ప్రజల ఆదరణ మజ్లిస్‌కే:
అహ్మద్ బలాల, ఎంఐఎం అభ్యర్థి

పాతబస్తీ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్న ఎంఐఎం పార్టీకే ఇక్కడి ప్రజల ఆదరణ దక్కుతుందని ఆ పార్టీ అభ్యర్థి అహ్మద్ బలాల నమ్ముతున్నారు. 15 ఏళ్లగా నియోజకవర్గంలో రకాల మౌలిక వసతులు కల్పించామని, మలక్‌పేటవాసులు తిరిగి తనకే పట్టం కడతారని బలాల ధీమా వ్యక్తం చేస్తున్నారు.

మార్పు కోరుతున్న మలక్‌పేట ప్రజలు:
షేక్ అక్బర్, కాంగ్రెస్ అభ్యర్థి

మార్పు కోరుకుంటున్న మలక్‌పేట ప్రజలు జాతీయపార్టీ అయిన కాంగ్రెస్‌ను నియోజకవర్గంలో గెలిపిస్తారని అభ్యర్థి షేక్ అక్బర్ ధీమాతో ఉన్నారు. నిజమైన అభివృద్ధి కోరుకుంటున్న మలక్‌పేట వాసులు ఈసారి కాంగ్రెస్‌కు తప్పనిసరిగా అవకాశమిస్తారని ఆయన అంటున్నారు.

బీజేపీతోనే పాతబస్తీ అభివృద్ధి సాధ్యం:
సంరెడ్డి సురేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి

పాతబస్తీలో అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని నమ్ముతున్న మలక్‌పేట ప్రజలు ఈసారి ఎన్నికల్లో బీజేపీని గెలిపించడం ఖాయమని అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అంటున్నారు. నియోజకవర్గ ప్రజలు బీజేపీతోనే ఉన్నారని తన గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలతో బీఆర్‌ఎస్ గెలుపు:
అజిత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి

అన్నివర్గాల అభ్యున్నతి కోసం తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన పథకాలే బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయని అభ్యర్థి అజిత్‌రెడ్డి అంటున్నారు. మలక్‌పేటలో మొదటిసారి బీఆర్‌ఎస్ గెలుస్తుందని ఆయన ధీమాగా ఉన్నారు.

బీజేపీతోనే ఎల్బీనగర్ అభివృద్ధి సాధ్యం

- బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి


కొత్తపేటలో ప్రచారం చేస్తున్న రంగారెడ్డికి హారతి పడుతున్న మహిళలు

నాగోలు: ఎల్బీనగర్ నియోజకవర్గ అభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి తనకు ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే అభ్యర్థి సామ రంగారెడ్డి కోరారు. శుక్రవారం కొత్తపేట డివిజన్ లో సామ రంగారెడ్డి పర్యటించారు. మొదట కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్‌తో కలిసి ఆంజనేయ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం బీజేపీ నాయకులతో కలిసి కాలనీలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ పాలనలో ఎల్బీనగర్ నియోజకవర్గంలో అవినీతి పెరిగిపోయిందన్నారు. గతంలో బీజేపీ ఎమ్మెల్యే అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధి తప్ప..బీఆర్ ఎస్ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు మంచి రాజేష్, అంబాల మల్లేష్, జంగారెడ్డి, సుందర్ నారాయణ, గీత రెడ్డి, వాజీర్ కుమార్, అశోక్ గౌడ్, ఉపేందర్ సింగ్, కొత్త తిరుమల, విజయ, వైజయంతి తదితరులు పాల్గొన్నారు.

నాగోలు డివిజన్‌లో..

నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్ ఆధ్వర్యంలో నాగోలు రామాలయంలో నిర్వహించిన పూజలో సామ రంగారెడ్డి పాల్గొన్నారు. అనంతరం నాగోలు గ్రామంలో ప్రచారం చేశారు.

ఇంద్రసేనా రెడ్డి చేసిన అభివృద్ధే కనిపిస్తోంది...

హస్తినాపురం: ఎల్‌బీ నగర్ నియోజకవర్గంలో ఇంద్రసేనారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి పనులు, ప్రస్తుతం బీజేపీ కార్పొరేటర్లు చేపట్టిన అభివృద్ధి తప్ప.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని ఎల్‌బీనగర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని సెంట్రల్ కాలనీలోని ఆలయంలో శుక్రవారం ఆయన పూజలు చేసి డోలుకొట్టి డివిజన్ పార్టీ అధ్యక్షుడు పి.నరేశ్‌యాదవ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు.

వేల కోట్ల నిధులతో అభివృద్ధి చేశా..

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


గుంటి జంగయ్యనగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో వేల కోట్ల రూపాయల నిధులను తెచ్చి అభివృద్ధి పనులు చేపట్టానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ గుంటి జంగయ్యనగర్‌లో గురువారం రాత్రి జరిగిన బీఆర్‌ఎస్ సమావేశంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రధాన సమస్యలన్నీ పరిష్కరించామని, మిగిలి ఉన్న సమస్యలను కూడా రాబోయే రోజుల్లో పరిష్కరిస్తానన్నారు. ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో గోపాల్, యాదయ్య, కన్నా, స్వరూప, కృష్ణమాచారి, లక్ష్మణ్, నర్సింగ్‌రావు ఉన్నారు.

క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ మద్దతు..

నాగోలు: ఎల్‌బీ నగర్ నియోజకవర్గ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం కొత్తపేట డివిజన్‌లోని హోసన్నా మందిరంలో శుక్రవారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు ఇస్తామని కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి అసోసియేషన్ నాయకులు హామీ ఇచ్చారు. చర్చి పాస్టర్స్ జాకబ్, దేవనంద్, ప్రసాద్, సోల్మాన్, మాథ్యూస్ మెగార్, ఆనందం, ఏసుపాదం, టైటాస్ బాబు, శ్యామ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి పాదయాత్ర

చాదర్‌ఘాట్: మలక్‌పేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అజంపురా డివిజన్‌లో శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మసీదుల వద్ద ప్రముఖులను కలిసి మద్దతు కోరానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముజఫర్ లీఖాన్‌తో కలిసి పాదయాత్ర నిర్వహించానని తెలిపాడు. పాదయాత్రలో నాయకులు శ్రీనివాసరెడ్డి, కిషన్‌సింగ్, షాహీద్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో గెలుపు ఖాయం


సంరెడ్డి సురేందర్‌రెడ్డిని సన్మానించిన ఆలయ కమిటీ సభ్యులు

సైదాబాద్: కార్యకర్తల సమష్టి కృషితో మలక్‌పేట నియోజకవర్గంలో బీజేపీ గెలుపు ఖాయమని పార్టీ అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. పార్టీ అధిష్టానం ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన నేపథ్యంలో నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలోని పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలను శుక్రవారం ఆయన కలుసుకొని మద్దతు కోరారు. ఈ సందర్భంగా శంకేశ్వరబజార్‌లోని ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రాజశ్యామల యాగం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని స్వధర్మసభ శ్రీ విద్యా శక్తి పీఠమ్‌లో శ్రీనారాయణ చక్రవర్తి శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం రాజశ్యామల యాగం ఘనంగా నిర్వహించారు. మహా పూర్ణాహుతిలో బీజేపీ జాతీయ నాయకులు పేరాల శేఖర్ జీ, మహేశ్వరం బీజేపి ఎమ్మెల్యే అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ పాల్గొన్ని పూజలు నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధీరజ్ రెడ్డి, ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు ముంతా రాములు, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థికి చుక్కెదురు!

- ప్రచారానికి నిరాకరించిన నేతలు

సైదాబాద్: మలక్‌పేట బీఆర్‌ఎస్ అభ్యర్థికి ప్రచారంలో చుక్కెదురైంది. సొంత పార్టీ నేతలే ప్రచారానికి నిరాకరించడంతో అనుమతులు తీసుకున్నా ప్రచారం చేయలేక మానుకోవాల్సి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి... మలక్‌పేట బీఆర్‌ఎస్ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి శుక్రవారం సైదాబాద్ డివిజన్‌లో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించుకున్నారు. అందు కోసం ఎన్నికల అధికారులు, పోలీసుల నుంచి రెండు రోజుల ముందుగానే అనుమతులు కూడా తీసుకున్నారు. అయితే తమ డివిజన్‌లో ప్రచారం చేసే ముందు తమకు సమాచారమివ్వరా అని స్థానిక నేతలు ప్రశ్నించినట్లు తెలిసింది. ముందస్తు సమాచారం లేకుండా ప్రచారంలో పాల్గొనబోమని వారు తేల్చి చెప్పడంతో అభ్యర్థి కంగుతిన్నారు. ఎన్నికల ప్రచారానికి అనుమతులు తీసుకున్నా సొంత పార్టీ నేతలు సహకరించక పోవడంతో ఆయన శుక్రవారం తన ప్రచారాన్ని మానుకోవాల్సి వచ్చింది.

నాలుగోసారీ బలాలకే మలక్‌పేట మజ్లిస్ టికెట్

హ్యాట్రిక్ సాధించి..మళ్లీ బరిలోకి..


అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల

మలక్‌పేట: మజ్లిస్ పార్టీ మలక్‌పేట నియోజకవర్గ టికెట్ మళ్లీ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలనే వరించింది. ఇప్పటికే మూడు దఫాలు శాసన సభ్యుడిగా సేవలందించిన బలాలకు 4వ సారి పోటీ చేసేందుకు అవకాశం ఇచ్చింది మజ్లిస్ పార్టీ అధిష్టానం. వ్యాపారవేత్త అయిన బలాల రాజకీయాలపై దృష్టి పెట్టి 2004లో మజ్లిస్ పార్టీ నుంచి పత్తార్‌గట్టీ కార్పొరేటర్‌గా గెలుపొందారు. 2009 ఎన్నికల్లో మజ్లిస్ అభ్యర్థిగా తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో నిలబడి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ముజఫర్‌అలీఖాన్‌పై 8371 ఓట్ల మెజారిటీతో గెలుపొంది అసెంబ్లీలో అడుగు పెట్టారు. 2014లో బీజేపీ అభ్యర్థి బి.వెంకట్‌రెడ్డిపై 23,263 ఓట్ల మెజారిటీతో రెండోసారి ఎమ్మెల్యే అయ్యారు. 2018లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన టీడీపీ అభ్యర్థి ముజఫర్ అలీఖాన్‌పై 23,512 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మజ్లిస్ ఎమ్మెల్యే కంటే వ్యక్తిగత అభిమానంతో రాజకీయాలకతీతంగా నియోజకవర్గ ప్రజల అభిమానం పొందగలిగారు. మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ గట్టి నమ్మకంతో నాలుగోసారి బరిలో నిలిపేందుకు ఎంపిక చేశారు. గత 15 ఏళ్లలో మలక్‌పేటను రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేశానని, నాలుగోసారి విజయం సాధించడానికి ప్రజలు మన స్ఫూర్తిగా సహకరిస్తారని ఆశిస్తున్నానని ఈ సందర్భంగా బలాల అన్నారు.

వివరాలు...

పేరు: అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల
పుట్టిన తేదీ: 22-10-1967
విద్యార్హతలు: ఎస్సెస్సీ
కుటుంబం: భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు.
వృత్తి: వ్యాపారం
నియోజకవర్గం: మలక్‌పేట

బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

దిల్‌సుఖ్‌నగర్: మంత్రి సబితా ఇంద్రారెడ్డితోనే మహేశ్వరం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, మరోసారి సబితా ఇంద్రారెడ్డిని గెలిపించాలని బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ అన్నారు. శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్‌లో బీజేపీ, కాంగ్రెస్ నుంచి దాదాపు 100 మంది యువకులు బీఆర్‌ఎస్ నాయకుడు పట్లోలా కల్యాణ్, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ మరోసారి అధికారంలోకి వచ్చి ప్రభంజనం సృష్టించనుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రామచారి, శ్రీనివాస్, కొంద్ర శ్రీనివాస్ పెంబరీ శ్రీనివాస్, వెంకటేష్ గౌడ్ జహీద్ పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయించే వారిపై కఠిన చర్యలు

దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి రవీందర్ రావు ఆదేశాల మేరకు అక్రమంగా మద్యం విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని సరూర్‌నగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి. శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచీ 74 కేసులు నమోదైనట్టు తెలిపారు. ఇప్పటి వరకు 210 లీటర్ల లిక్కర్, 48 లీటర్ల బీరు, 5000 లీటర్ల కల్లు, 240 లీటర్ల సుంకం చెల్లించని మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐలు ముజాహిద్ సుతారి, ఇబ్రహీం పాషా, సామజ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య శ్రీరామ అక్షింతలకు స్వాగతం పలుకుదాం

వనస్థలిపురం: అయోధ్య శ్రీరామ జన్మభూమి మందిర అక్షింతలను భాగ్యనగరానికి స్వాగతం పలికే మహత్తర కార్యక్రమంలో మనం అందరం పాల్గొందామని వీహెచ్‌పీ రాష్ట్ర సహ కార్యదర్శి రావినూతల శశిధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 6న సోమవారం ఉదయం 10 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వద్ద అయోధ్య శ్రీరామ అక్షింతలకు స్వామీజీలు స్వాగతం పలికి కర్మన్‌ఘాట్ హనుమాన్ మందిరం వరకు శోభాయాత్ర నిర్వహిస్తారని ఆయన తెలిపారు. శ్రీరాముని అక్షింతలను దర్శించుకుని, అయోధ్య శ్రీరామ మందిర ప్రాణప్రతిష్ఠ మహోత్సవంలో మనం అందరం భాగమవుదామని ఆయన పేర్కొన్నారు.

నిజమైన ప్రజాసేవకుడు మధుయాష్కీ


మధుయాష్కీ గౌడ్, వజీర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన యువత

ఏపీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు

నాగోలు: కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజల సంక్షేమ కోసం నిరంతరం కృషి చేస్తుందని, ఎల్‌బీనగర్‌లో నిజమైన ప్రజాసేవ చేసే మధుయాష్కీగౌడ్ లాంటి నేతను భారీ మెజార్టీతో గెలించాలని ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు కాంగ్రెస్ నాయకులకు పిలుపునిచ్చారు. మధుయాష్కీకి మద్దతుగా కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో రాజధాని గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ, సామన్య మధ్య తరగతి కుటుంబానికి చెందిన మధుయాష్కీ కాంగ్రెస్ పార్టీలో రాహుల్‌గాంధీ టీమ్‌లో పని చేస్తున్నాడని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంతో నమ్మకం పెట్టుకొని సుధీర్‌రెడ్డికి టికెట్ ఇచ్చి గెలిపిస్తే తన స్వార్థం కోసం పార్టీ మారడని విమర్శించారు. మధుయాష్కీని గెలిపిస్తే ఈ ప్రాంతానికి అధిక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తాడని తెలిపారు. మధుయాష్కీ మాట్లాడుతూ, ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కొత్తపేట డివిజన్‌కు చెందిన వివిధ కాలనీల ప్రజలు, యూత్ అసోసియేషన్ సభ్యులు వజీర్ ప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో మధుయాష్కీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొత్తపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగాల కిషోర్, కత్తి కార్తీక, దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సుధీర్‌రెడ్డిని ఓడించాలి

చైతన్యపురి: హుడా చైర్మన్, ఎమ్మెల్యే పదవి ఇచ్చిన తల్లిలాంటి కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచి ద్రోహం చేసిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని ఓడించి తగిన బుద్ధి చెప్పాలని ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. చైతన్యపురిలోని నియోజవర్గ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎల్‌బీనగర్‌లో కాంగ్రెస్ పార్టీ నిలబెట్టి, అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచే స్థాయికి తీసుకురావడంలో మల్‌రెడ్డి రాంరెడ్డి కృషి ఎంతో ఉందన్నారు.

భారీ బందోబస్తు మధ్య నామినేషన్ల స్వీకరణ

ఎల్బీనగర్‌లో మొదటి రోజు రెండు నామినేషన్ల దాఖలు


ఎల్‌బీనగర్ ఆర్‌ఓ ఆఫీసు వద్ద పోలీసు బందోబస్తు

చైతన్యపురి: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి సంబంధించి కొత్తపేటలోని రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయంలో నామిషన్లు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్లు సమర్పించే వారిని మినహా ఎవరినీ లోపలికి అనుమతించలేదు. ఆర్‌ఓ కార్యాలయం రహదారిలో 100 మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలపై ఆంక్షలు విధించారు. ఎల్‌బీనగ్ ఏసీపీ జానకిరెడ్డి, సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ బందోబస్తును పర్యవేక్షించారు.

మొదటి రోజు రెండు నామినేషన్లు..

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన మొదటి రోజు రెండు నామినేషన్లు వచ్చాయని ఎల్‌బీనగర్ రిటర్నింగ్ అధికారి ఎస్.పంకజ తెలిపారు. సోషల్ జస్టిస్ ఆఫ్ ఇండియా పార్టీ అభ్యర్థిగా చామకూర రాజయ్య, ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థిగా మంచాల శ్రీకాంత్ నామినేషన్ దాఖలు చేశారు. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ఎవరూ కూడా నామినేషన్ వేయలేదు.

మలక్‌పేటలో ఒక నామినేషన్..

చాదర్‌ఘాట్: యాకత్‌పురాకు చెందిన మహ్మద్ అక్రం అలీ ఖాన్ ఇండిపెండెంట్‌గా శుక్రవారం మలక్‌పేట ఆర్‌ఓ కార్యాలయంలో దాఖలు చేశారు.

భారీ బందోబస్తుతో ఇబ్బందులు

మలక్‌పేట ఆర్‌ఓ కార్యాలయం వద్ద నాలుగు అంచెల భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పక్కనే ఉన్న దివ్యాంగుల కార్యాలయానికి వచ్చే ఫిర్యాదుదారులను పోలీసులు అనుమతించలేదు. వీరితో పాటు సదరు కార్యాలయానికి వెళ్లే ఉద్యోగులు కూడా ఇబ్బందులు పడ్డారు.

ఎన్నికల వ్యయ పరిశీలకుడి సమీక్ష..

ఎల్‌బీనగర్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఎన్నికల వ్యయ పరిశీలకుడు శ్రీప్రియ రంజాన్ వాస్తవ.. ఎన్నికల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. నిబద్ధతతో విధులు నిర్వహించాలని ఎన్నికల వ్యయ పరిశీలక సిబ్బందికి ఆయన సూచించారు. రిటర్నింగ్ అధికారి పంకజ, డీసీపీ సాయిశ్రీ, ఎన్నికల అధికారులు అరుణకుమారి, ప్రసాదరావు, ఎమ్‌సీసీ, ఎన్నికల వ్యయ పరిశీలక సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పద్మశాలీ దసరా మేళా

మన్సూరాబాద్: పద్మశాలీ సంఘం, ఎల్‌బీనగర్ సర్కిల్ ఆధ్వర్యంలో 21వ పద్మశాలీ దసరా మేళాను హరిణ వనస్థలి జాతీయ పార్కు (జింకల పార్కు)లోని అనన్య ఎకో రిసార్ట్‌లో ఆదివారం నిర్వహిస్తామని సంఘం అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, మేళా చైర్మన్ కొకుంట్ల రవితేజ తెలిపారు. జంట నగరాల్లోని పద్మశాలీ సంఘాల నాయకులు, అనుబంధ సంఘాల నేతలు, చేనేత కళాకారులు, సహకార సంఘాల ప్రతినిధులు, కులబాంధవులు హాజరై దసరా మేళా విజయవంతం చేయాలని కోరారు.

అరుణాచలానికి బస్ సర్వీసు

చైతన్యపురి: కార్తీక పౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని అరుణాచలం క్షేత్ర గిరి ప్రదర్శనకు వెళ్లాలనుకునే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్ సర్వీస్ నడుపుతున్నట్లు దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్-2 డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. ఈనెల 25న రాత్రి 8 గంటలకు ఎంజీబీఎస్ నుంచి బస్ బయలు దేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం వెళ్తుందన్నారు. తిరిగి 28న ఉదయం 6 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుందన్నారు. అలాగే ఈసీఐఎల్, బీహెచ్ఈఎల్ నుంచి కూడా అరుణాచలానికి బస్‌లు నడుపుతామన్నారు. ప్రయాణికులు ప్రత్యేక బస్ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని డీఎం కృష్ణమూర్తి కోరారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం


నర్సింహ (ఫైల్)

హస్తినాపురం: భర్తతో గొడవ జరగడంతో పిల్లలను తీసుకొని భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్థాపం చెందిన భర్త ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ విషాద ఘటన జరిగింది. ఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన బి.నర్సింహ (40) రాధిక దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్న నర్సింహ జీవనోపాధి కోసం పదేళ్ల క్రితం కుటుంబంతో సహా నగరానికి వచ్చి వనస్థలిపురం వైదేహినగర్‌లో ఉంటున్నాడు. గత కొంత కాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరగడంతో మనస్థాపం చెందిన రాధిక పిల్లలను తీసుకొని తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన నర్సింహ తాను నివాసం ఉంటున్న ఇంట్లోని సెల్లార్‌లో కొక్కానికి చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. నర్సింహ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి మృతుని తండ్రి గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సదర్ ఉత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

సైదాబాద్: సదర్ ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని అఖిల భారత యాదవ మహాసభ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మైల్‌కోల్ మహేందర్‌యాదవ్ కోరారు. శుక్రవారం సైదాబాద్‌లోని శ్రీప్రసన్నాంజనేయ ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మహాసభ ప్రతినిధులతో కలిసి సదర్ ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దీపావళి పండుగ మరుసటి రోజు అత్యంత భక్తిశ్రద్ధలతో దున్నల ప్రదర్శనను కోలాహలంగా నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు. కార్యక్రమంలో మహాసభ నాయకులు నేతుల శ్రీశైలం యాదవ్, బత్తుల మహేందర్ యాదవ్, కృష్ణయాదవ్, మాణిక్ యాదవ్ పాల్గొన్నారు.

భార్య, బిడ్డను సజీవ దహనం చేసిన వ్యక్తికి జీవిత ఖైదు

రంగారెడ్డి కోర్టులు: భార్య, కూతురిని సజీవ దహనం చేసిన కేసులో నిందితుడికి రంగారెడ్డి జిల్లా 9వ అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి హరీశ జీవిత ఖైదుతో పాటు రూ. 10 వేల జరిమానా విధించారు. కోర్టు ఏపీపీ రాము కథనం ప్రకారం... చేవెళ్ల ఠాణా పరిధిలో నివాసం ఉండే ఎరుకల రాజు (37), రోజా ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. పెళ్లైన కొన్ని రోజుల వరకూ కాపురం సజావుగా సాగింది. పిల్లలు పుట్టిన తర్వాత రాజు మద్యానికి బానిసయ్యాడు. రోజు తా గేసి వచ్చి భార్యా పిల్లలను హింసించేవాడు. ఇదే క్రమంలో 2019లో ఘటన జరిగిన రో జున మద్యం తాగి ఇంటికి వచ్చాడు. దీంతో భార్య రోజా తాగి వస్తే కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని భర్తను హెచ్చ రించింది. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన రోజు.. భార్య, కూతురిపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. వారి ఆర్తనాదాలు విన్న ఇరుగు పొరుగు వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాలిన గాయాలతో ఉన్న తల్లి, కూతురిని పోలీసులు ఆసుపత్రిలో చేర్పించారు. బాధితురాలు రోజా వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. తల్లి, కూతురు చికిత్స పొందుతూ మృతి చెందారు. కాగా, నిందితుడిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు విచారణ చేపట్టిన కోర్టు మృతురాలి మరణవాగ్మూలం ఆధారంగా నిందితుడు రాజుకు జీవిత ఖైదుతో పాటు రూ. 10 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించింది.

నేడు మాతృశ్రీలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

సైదాబాద్: మాతృశ్రీ ఇంజినీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే -2023 వేడుకలను శనివారం ఉదయం నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హనుమంతరావు తెలిపారు. శుక్రవారం ఆయన కళాశాలలో విలేకరులతో మాట్లాడుతూ, కళాశాలలోని ఎంవీ శ్రీధర్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ఉదయం నిర్వహించే ఈ వేడుకల్లో ముఖ్యఅతిథులుగా ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఎంఈఎస్ చైర్మన్ డాక్టర్ కేపీ శ్రీనివాస్‌రావు హాజరవుతారన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 23, వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి40, కాకర 23, బీర 23, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 12.

పన్ను చెల్లించని మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

- మలక్‌పేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్



మలక్‌పేట: పన్ను చెల్లించని మద్యం అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మలక్‌పేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె. గోపాల్ హెచ్చరించారు. అక్బర్‌బాగ్‌లోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్‌పీ పవన్‌కుమార్ ఆదేశాల మేరకు మలక్‌పేట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం అమ్మకాలకు తావు లేకుండా గట్టి నిఘా పెట్టామన్నారు. ఇటీవల చేపట్టిన తనిఖీల్లో 56 లీటర్లు లిక్కర్, 68 లీటర్ల బీరు, 754 లీటర్ల కల్లు పట్టుబడిందన్నారు. 22 కేసులు నమోదు కాగా, 9 మందిని అరెస్ట్ చేసి, 35 మందిని బైండోవర్ చేశామని తెలిపారు. సారా, గంజాయి, మత్తు పదార్థాలు, పన్ను చెల్లించని మద్యం అమ్మినా, నిల్వ చేసినా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డ్రగ్స్, గంజాయి, మద్యం విక్రయిస్తున్నట్టు తెలిస్తే వెంటనే 1800-425-2523 టోల్-ఫ్రీ నంబర్‌కు, లేదా మొబైల్ నం. 87126 59641 ద్వారా ఎక్సైజ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. నకిలీ మద్యం, తెలంగాణ రాష్ట్రానికి చెందిన మద్యంను గుర్తించడానికి 'వేరిట్' యాప్‌లో చెక్ చేసుకోవచ్చన్నారు. సమావేశంలో ఎక్సైజ్ ఎస్సై అనీస్ ఉద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.